ఏపీలో మరో ఫార్మా కంపెనీలో ప్రమాదం

- పరవాడ ఫార్మాసెజ్‌లో కార్మికులకు తీవ్ర గాయాలు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏపీలోని అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ సంస్థలో గురువారం అర్ధరాత్రి నలుగురికి గాయాలయ్యాయి. బీ-బ్లాక్‌లోని మొదటి అంతస్తు రియాక్టర్‌లో కెమికల్ చార్జింగ్ చేస్తుండగా మ్యాన్‌హోల్ నుంచి రసాయనం ఉప్పొంగి కార్మికులపై పడింది. దీంతో జార్ఖండ్‌కు చెందిన లాల్‌సింగ్, కోహర్, రోస, విజయనగరానికి చెందిన కెమిస్ట్ సూర్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను విశాఖలోని ఇండస్ దవాఖానకు తరలించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇటీవల ఇదే జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 18 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా..

- మద్యం మత్తులో నాటుపడవ ఎక్కిన యువకులు
- విజయవాడ రూరల్ పాతపాడులో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని విజయవాడ రూరల్ మండలం పాతపాడులో ఐదుగురు స్నేహితులు మద్యం సేవించి చేపల చెరువు వద్దకు వెళ్లారు. నాటుపడవ ఎక్కి సెల్ఫీలు దిగుతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో శివానంద్ (23), రవికుమార్ (21) మృతిచెందగా మరో ముగ్గురిని స్థానికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి మెట్టుమార్గంలో ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని చిత్తూరు నగరం బంగారురెడ్డిపాలేనికి చెందిన సతీశ్, రాధిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చిన వీరు శుక్రవారం తిరుమలలో 450వ శ్రీవారి మెట్టు వద్ద పురుగుల మందు తాగారు. గమనించిన భక్తులు టీటీడీ సెక్యూరిటీకి సమాచారం అందించడంతో వారు ప్రేమ జంటను దవాఖానకు తరలించారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు.

టీ-ఫైబర్‌కు 1,779 కోట్ల రుణమివ్వండి

- రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ కనెక్షన్ ఇస్తాం
- 93 లక్షల గృహాలకు ఫైబర్ కనెక్షన్ మా లక్ష్యం
- జాతీయ క్రీడల నిర్వహణకు చాన్స్ ఇవ్వండి
- కేంద్రమంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): టీ-ఫైబర్‌కు రూ.1,779 కోట్ల మేర వడ్డీలేని దీర్ఘకాలిక రుణం ఇవ్వాలని కేంద్ర టెలికం, కమ్యూనికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్-3గా మార్చేందుకు సమర్పించిన డీపీఆర్‌ను ఆమోదించాలని విజ్ఞప్తిచేశారు. ఢిల్లీలో శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం కేంద్రమంత్రులను వేర్వేరుగా భేటీ అయ్యారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లోని 30 లక్షల గృహాలకు నెలకు రూ.300కే ఫైబర్ కనెక్షన్ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర మంత్రి సింధియాకు తెలిపారు. టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, సాంఘిక సంక్షేమ పాఠశాలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ (ఎన్‌వోఎఫ్‌ఎన్) తొలిదశను భారత్‌నెట్-3 ఆర్కిటెక్చర్‌కు మార్చడానికి గత అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపించామని, దానిని త్వరగా ఆమోదించాలని కోరారు.

జాతీయ క్రీడల నిర్వహణకు అన్ని వసతులు

జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు తెలంగాణలో ఉన్నాయని, వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహించే అవకాశం ఇవ్వాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్‌స్పోర్ట్స్, ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడలను తెలంగాణలో నిర్వహించే అవకాశం ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. జీఎంసీ బాలయోగి స్టేడియం, షూటింగ్ రేంజ్, ఎల్‌బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం అప్‌గ్రేడేషన్‌కు సమర్పించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్రమంత్రిని కోరారు.

రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

గవర్నర్.. సార్!

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొద్దిసేపు టీచర్‌గా మారారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. అక్కడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల నైపుణ్యాలను గవర్నర్ స్వయంగా పరీక్షించారు. చదవడం, రాయడాన్ని గమనించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ధృఢ సంకల్పంతో తమ కలలను సాకారం చేసుకోవాలని, సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని విద్యార్థులకు హితబోధ చేశారు. విద్యార్థుల ప్రతిభను ఈ సందర్భంగా ప్రశంసించారు. పిల్లలతో ఆయన కొద్దిసేపు సన్నిహితంగా కలిసిపోయారు.

బాబు ఎత్తుకు రేవంత్ చిత్తు!

I పేజీ తరువాయి...

స్పందించకపోగా.. ఈ పరిణామాలతో తెలంగాణ ఆర్థిక శాఖ అధికారులు విస్తుపోతున్నారు. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 54 [1] స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం నిర్ణయం తీసుకున్నదని మండిపడుతున్నారు.

బాబు.. మొదటి నుంచీ కొర్రీలే

రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఏపీ మధ్య జనాభా దామాషాలో ఆస్తులు, అప్పుల విభజన జరగాలని ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 54 [1] స్పష్టం చేస్తున్నదని నిపుణులు చెప్తున్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం దేశీయంగా కేంద్ర ప్రభుత్వం, ఇతర సంస్థల నుంచి తెచ్చిన రుణాలతోపాటు జపాన్‌కు చెందిన జైకా, వరల్డ్ బ్యాంకు వంటి విదేశీ సంస్థల నుంచి తెచ్చిన అప్పులు కూడా పంపకాల్లో భాగంగా ఉన్నాయి. విదేశీ బ్యాంకుల నుంచి తెచ్చిన నిధులు రూ.30వేల కోట్ల వరకు ఉంటాయని అంచనా. ప్రాజెక్టు చేపట్టిన ప్రాంతం, నిధుల వినియోగాలతో సంబంధం లేకుండా రెండు రాష్ట్రాల మధ్య అప్పుల పంపకం జరగాల్సి ఉంటుంది. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 15 ప్రాజెక్టులకు చెందిన అప్పులపై కొర్రీలు పెట్టారు. తొమ్మిది ప్రాజెక్టుల అప్పును వినియోగం ఆధారంగా, మరో నాలుగు ప్రాజెక్టుల రుణాలను అవి ఉన్న ప్రాంతం ఆధారంగా, మరో రెండు ప్రాజెక్టుల రుణాలను జనాభా ప్రాతిపదికన పంచాలని పట్టుబట్టారు. కానీ.. ఆ అప్పులను సెక్షన్ 54 [1]కు లోబడి జనాభా ప్రాతిపదికన పంచాలని బీఆర్ఎస్ ప్రభుత్వం తేల్చి చెప్పిందని, దీంతో బాబు ఆటలు సాగలేదని పరిశీలకులు పేర్కొన్నారు.

ఒక్క భేటీతో తలకిందులు..

ఏపీలో చంద్రబాబు గెలిచిన వెంటనే తనదైన మార్క్ రాజకీయాలు మొదలు పెట్టారు. ఇక్కడ రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడంతో పాత బంధాన్ని గుర్తుచేస్తూ 'విభజన సమస్యలపై చర్చించుకుందాం రా' అంటూ స్నేహహస్తం చాచారు. ఈ ఏడాది జూన్ 6వ తేదీన ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ అయ్యారు. అయితే ఇక్కడి నుంచే చంద్రబాబు పాచికలు వేయడం మొదలు పెట్టారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సీఎంలు చర్చించిన అంశాలపై అధికారులు, మంత్రుల కమిటీల్లో చర్చించి, రెండు రాష్ట్రాలు ఒక పరిష్కార మార్గం వెతుక్కోవాల్సి ఉంటుంది. కానీ చంద్రబాబు నేరుగా కేంద్ర మంత్రిత్వశాఖ వద్దకు వెళ్లారని.. సమైక్య రాష్ట్రంలో విదేశీ నిధులు తెచ్చి చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు, హుస్సేన్ సాగర్ పనులకు సంబంధించి తెలంగాణ తన వాటా చెల్లించడం లేదని, ఏపీనే ఆ మొత్తం కట్టిందని చెప్పారని అంటున్నారు. ఈ నిధులను తెలంగాణ నుంచి వసూలు చేసి, ఏపీకి చెల్లించాలంటూ చక్రం తిప్పినట్టు చెప్తున్నారు. దీంతో చంద్రబాబుకు తలొగ్గిన కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నదని.. తెలంగాణ ప్రభుత్వం ప్రమేయం లేకుండానే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2,500 కోట్లను ఏపీ ఖాతాలో వేసిందని చెప్తున్నారు. ఇప్పటికే ఆర్థికంగా సతమతం అవుతున్న తెలంగాణకు ఇది ములిగే నక్కపై తాటిపండు పడ్డట్టు అయ్యింది. ఈ పరిణామాలపై ఆర్థిక శాఖ అధికారులు సైతం విస్తుపోతున్నారు. అప్పుల్లో తెలంగాణ వాటా తేల్చడంపై విజ్ఞప్తి ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా నిధులు ఎలా బదలాయిస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది.

తెలంగాణకు రావాల్సినవి అడుగుతారా?

ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై ఢిల్లీలోనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అడుగుతారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ (సీఎస్ఎస్) నిధులు రూ.454 కోట్లు ఏపీ ఖాతాలో పడ్డాయి. ఈ నిధులు తిరిగి ఇప్పించాలని తెలంగాణ ప్రభుత్వం పదేండ్లుగా అడిగినా కేంద్రం స్పందించలేదు. ఇప్పుడు తెలంగాణ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2,500 కోట్లు మళ్లించిన కేంద్రం.. ఇదే పద్ధతిలో సీఎస్ఎస్ నిధులను ఏపీ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఎందుకు ఇవ్వదని ప్రశ్నిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఈ అంశంపై నిలదీయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతోపాటు వాటా తేలకుండా మిగిలిపోయిన అప్పులు, ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్తు బకాయిల వంటివి కూడా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఇప్పించాలని డిమాండ్ చేయాలని సూచిస్తున్నారు.

పీసీసీ సారథి ఎవరు?

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్‌కు నూతన సారథి, మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో శుక్రవారం జోరుగా చర్చలు జరిగాయి. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో మధ్యాహ్నం చర్చలు జరిపారు. రాత్రి పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అంశాలపై చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఫలితంగా ఈ నెలాఖరుకు మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం.

పీసీసీ చీఫ్ ఎవరో?

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పదవీ కాలం ముగియడంతో కొత్త నేతను ఎంపిక చేయాల్సి ఉంది. పీసీసీ రేసులో బలరాం నాయక్, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ ఉన్నారు. వీరిలో మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి మధ్యే పోటీ నెలకొన్నది. ఢిల్లీలో జరిగిన చర్చల్లో అధిష్ఠానంతోపాటు రాష్ట్ర మెజార్టీ నేతలు మహేశ్‌కుమార్ గౌడ్ వైపే మొగ్గు చూపినట్టు తెలిసింది. ఈ మేరకు నేడో రేపో అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

వైద్య రంగంలోకి వరల్డ్‌బ్యాంకు!

I పేజీ తరువాయి...

పరికరాల కొనుగోలుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హామీ ఇచ్చారు. దీంతోపాటు టీవీవీపీ పరిధిలోని దవాఖానల్లో పరికరాల కొనుగోలుకు సైతం నిధులు ఇస్తామని చెప్పారు. ఆరోగ్య మహిళా క్లినిక్స్‌ను పెంచడానికి కూడా నిధులు ఇస్తామని తెలిపారు. ట్రామా సెంటర్లు, క్యాన్సర్ స్క్రీనింగ్, కిడ్నీ ఇన్‌ఫెక్షన్లను గుర్తించే ఆధునిక యంత్రాలను అందించడానికి అవసరమైన ప్రతిపాదనలను అందించాలని మంత్రికి సూచించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాక్షి, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు జుంకో ఓనిషి, అపర్ణ సోమనాథ్, బత్తుల అమిత్ నాగరాజ్, అజయ్‌టాండన్, లక్ష్మీ శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాలం చెల్లిన మందులు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పీహెచ్‌సీల్లో కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచుతున్నారని డీపీహెచ్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. ఆ మందులను పడేయకుండా, నిల్వ ఉంచినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే వాటిని గుర్తించి పడేయాలని తాజాగా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాలని మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులను ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు జరుపుతామని, కాలం చెల్లిన మందులు దొరికితే దవాఖాన సిబ్బందితోపాటు డీఎంహెచ్‌వోలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూడాల సమ్మె విరమణ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు (జూడా) సమ్మె విరమించారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ దవాఖాన ఘటన నేపథ్యంలో ఈ నెల 14 నుంచి వారు సమ్మెలో కొనసాగుతున్నారు. తాము లేవనెత్తిన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ఈ నేపథ్యంలోనే సమ్మె విరమిస్తున్నట్టు జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి సేవలు కొనసాగిస్తామని, ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోతే మళ్లీ సమ్మెకు సిద్ధమని చెప్పారు.

మల్దకల్‌లో పత్తి చేనులో భారీ మొసలి కనిపించింది. అటవీ అధికారులు బంధించేందుకు యత్నించగా తప్పించుకొని సమీపంలోకి బావిలోకి దూరింది. నీటిని ఎత్తిపోసి, మొసలిని తాళ్లతో పట్టుకొని కృష్ణానదిలో వదిలేశారు

రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?

బ్లిట్జ్ కథనంపై వివరణ ఇవ్వండి: బీజేపీ ఎంపీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?.. పెళ్లయ్యిందంటూ బ్లిట్జ్ పత్రికలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాహుల్‌గాంధీ కార్యాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బందికి బ్లిట్జ్ పత్రిక ను అందజేశారు. ఆయన స్వయంగా పత్రికను చదివి, అందులో వచ్చిన కథనంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశ వ్యవహారాలకు సంబంధించి విదేశీ మీడియా సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక సరైనదేనని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ వాదిస్తున్నపుడు, బ్లిట్జ్ కథనం కూడా సరైనదేనా? అని ప్రశ్నించారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

ప్రొఫార్మా 10-1
బహిరంగ ప్రకటన

PUB/0848

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:
సెక్షన్: హైదరాబాద్ డివిజన్: అక్కన్నపేట-మెదక్ సెక్షన్ మధ్య 2*25 విద్యుదీకరణతో కొత్త BG సింగిల్ లైన్ నిర్మాణం-ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు అక్కన్నపేట (AKE) మరియు మెదక్ (MDAK) స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ సింగిల్ లైన్ ప్రారంభానికి సంబంధించి.

****

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల బహిరంగ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు Km/Ch: 0/499.90 నుండి Km/Ch.17/326.60m వరకు అక్కన్నపేట్ నుండి మెదక్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. AKE/1008A (Km/Ch: 0/499.90) నుండి OHE మాస్ట్ Loc. 17/09 (Km/Ch.17/326.60m) వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: **10-09-2024**న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2
(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)
ac 25kV ట్రాక్షన్ ప్రారంభం
"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:
సెక్షన్: హైదరాబాద్ డివిజన్: అక్కన్నపేట-మెదక్ సెక్షన్ మధ్య 2*25 విద్యుదీకరణతో కొత్త BG సింగిల్ లైన్ నిర్మాణం-ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు అక్కన్నపేట (AKE) మరియు మెదక్ (MDAK) స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ సింగిల్ లైన్ ప్రారంభానికి సంబంధించి.

****

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల బహిరంగ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు Km/Ch: 0/499.90 నుండి Km/Ch.17/326.60m వరకు అక్కన్నపేట్ నుండి మెదక్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. AKE/1008A (Km/Ch: 0/499.90) నుండి OHE మాస్ట్ Loc. 17/09 (Km/Ch.17/326.60m) వరకు లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవలకు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైటిగేజ్‌లు స్థాపించబడినవి.**
లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తును గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.
అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:
i) హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.
ii) వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.
iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

డిప్యూటి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్, సికింద్రాబాద్

A1095

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర